# పర్సనల్ కాలమ్


డా॥ శ్రీమతి కొఠారి వాణీచలపతిరావు

'నా వయసు పధ్నాలుగు సంవత్సరాలు. పదవతరగతి చదువుతున్నాను. నేను మా పక్కింటి అబ్బాయిని గాఢంగా ప్రేమిస్తున్నాను. అతని వయసు పదహారు సంవత్సరాలు. ఇంటర్‌మీడియెట్ చదువుతున్నాడు. మేము ఇద్దరం ఒకసారి సెక్స్‌లో కూడా పాల్గొన్నాం. మా పెళ్లికి పెద్దలు అంగీకరిస్తారో లేదోనని భయంగా ఉంది. దయచేసి వాళ్లతో ఎలా అప్రోచ్ కావాలో సలహా చెప్పండి' -రీతు.

ఉత్తరం చదివి పక్కకు పెట్టాను.

మనసు 'అయ్యయ్యో... పసిపిల్లలు... దారి తప్పుతున్నారు' అని ఆక్రోశించింది. అలా ఆక్రోశించటం దానికి పరిపాటే. పధ్నాలుగేళ్ల... మొగ్గలాంటి ... ఆడపిల్ల అనగానే నాకళ్ల ముందు ఎప్పటిదో ఒక అందమైన దృశ్యం బొమ్మ కట్టింది. 'పట్టు పరికిణి కుచ్చెళ్లు పైకి పట్టుకుని... కొత్తగా అప్పుడప్పుడే వేసుకుంటున్న... పైట... ఇంకా బాగా అలవాటు కాక మాటిమాటికీ జారిపోతుంటే, తలలో దోసెడు కనకాంబరాల దండపెట్టుకుని... బొమ్మల పెండ్లిళ్లు చేస్తున్న ఆ తెలుగింటి ఆడపడుచు... ఎంత ముగ్ధ మనోహరంగా ఉంది! ఆ ముఖంలో లేతదనం, ఆ కళ్లల్లో అమాయకత్వం ముచ్చట గొలిపిస్తున్నాయి. సమర్తాడి ఇంకా పట్టుమని పదివారాలయినా కాకపోవడం వల్ల కాబోలు... సిగ్గంటే ఏమిటో తెలియని దానిలా... మగపిల్లలతో సైతం చక్కగా కలివిడిగా మాట్లాడుతోంది.' కళ్లు మూసుకుని నాముందు అంతవరకూ ఊహించుకున్న ఆ కమనీయ దృశ్యం కళ్లు తెరవగానే మాయమై దానిస్థానంలో పేపర్‌వెయిట్ కింది ఆ ఉత్తరం రెపరెపలాడింది గాలిలో దీపంలా.

బొమ్మల పెళ్లిళ్లు చేయాల్సిన వయసులో నీ పెళ్లిగురించి ఆలోచిస్తున్నావా అమ్మా' అని మనసులో అనుకుంటూ... జవాబు రాయడం మొదలుపెట్టాను.



"అమ్మా... రీతూ... నువ్వు ప్రేమ అనుకుంటున్నది అది ప్రేమ కాదు. ఆకర్షణ. ప్రేమ అంటే ఏమిటో తెలిసే వయసులో నువ్వు లేవు గనుక... ఆ పదాన్ని అనవసరంగా పదే... పదే వాడి నీ తెలివితక్కువతనాన్ని నిరూపించుకోకు. ఇప్పుడు నువ్వు కానీ, నీ పక్కింటి అబ్బాయిగానీ... ఉన్నది పెళ్లిచేసుకునే వయసులో కాదు. చదువుకునే వయసులో. ఇప్పటికే తప్పు చేశావు. చేసిన తప్పుకు చెంపలేసుకుని క్లాసు పుస్తకాల మీద ధ్యాసపెట్టు. మరొకసారి ఎప్పుడూ ఆ పక్కింటి అబ్బాయితో మాట్లాడటం గానీ, స్నేహం చేయడంగానీ చేయవద్దు. అలా చేశావంటే నీ జీవితం అధోగతిపాలు కావటం ఖాయం.' ఎవరికి ఏది చెప్పదలుచుకున్న సూటిగా, ఖచ్చితంగా చెప్పటం నాకు మొదటినుండీ అలవాటు.

ఎలాంటి మొహమాటాలకూ పోను.

నా పద్ధతి కొంతమందికి నచ్చుతుంది... మరి కొంతమందికి నచ్చదు. బహుశ ఈ పత్రికలవాళ్లకు నచ్చుతుందేమో. అందుకే పాఠకుల పర్సనల్ కాలమ్‌లో ప్రశ్నలకు జవాబులిమ్మని నన్ను అడిగారు. నాకు తెలిసిన విషయాన్ని, నా జీవితానుభవాలు... నాకు నేర్పిన పాఠాలను ఆధారంగా చేసుకుని నలుగురికి నాలుగు మంచిమాటలు చెబితే మంచిదే కదా' అని ఒప్పుకున్నాను. రోజూ వచ్చే ఎన్నో ఉత్తరాలు చదువుతుంటే ప్రస్తుత సమాజం ఈ మధ్య నాకు అద్దంలో కనిపించినట్టు కనిపిస్తోంది. అది చూస్తూ పర్సనల్ కాలమ్ నిర్వహిస్తుంటే నేనూ ఈ సమాజానికి ఏదో ఉడతసాయం చేస్తున్నాన్న తృప్తి కలుగుతోంది. మరో ఉత్తరం తీశాను.

'రచయిత్రిగారికి నమస్కారం

నాకు ఈమధ్యనే కొత్తగా పెళ్లయింది. నా భార్య అమాయకురాలు. పెద్దగా చదువుకోలేదు. నేనంటే తనకు చాలా ప్రేమ. కానీ నాకే ఆమె నచ్చటం లేదు. కారణం ఏమిటంటే బ్యాచులర్‌గా ఉన్నప్పుడే నాకు మాపక్క ఫ్లాట్‌లో ఉండే ఓ నలభై సంవత్సరాల స్త్రీతో శారీరక సంబంధం ఏర్పడింది. పెళ్లయినా ఇప్పటికీ... గాఢంగా నా మనసు, శరీరం ఆమెనే కోరుకుంటున్నాయి. నా భార్యకు

విడాకులివ్వాలన్న ఆలోచనలో ఉన్నాను.'

'మీ ఆలోచన అర్థాన్నంగా ఉంది. మీ భార్య చదువుకోలేదన్నారు. చదువుకుని తమరు ఉద్ధరించింది ఏమిటో కాస్త చెప్పండి. అమాయకత్వం ఆవిడది కాదు... మీది. పక్కింటావిడ వేసిన ఉచ్చులో బిగుసుకుపోవటం మీ అమాయకత్వమయితే ఆమె మీద కామంతో బంగారు భవిష్యత్తును జీవితప్రారంభంలోనే నాశనం చేసుకోవడం మీ తెలివితక్కువతనం. భార్యకు విడాకులివ్వాలని అనుకుంటున్నానని రాశారు. పెళ్లంటే బొమ్మలాటనా మీ ఉద్దేశం? పక్కింటి ఆ ఆంటీతో మీ సంబంధం శాశ్వతమైంది కాదు. రేపు మిమ్మల్ని ఆమె వదిలేస్తే మీకు మళ్లీ మీ భార్యే గతి అవుతుంది. మిమ్మల్ని నమ్ముకుని మీతో జీవితం గడపటానికి వచ్చిన మీభార్యకు అన్యాయం చేస్తే ఆ దేవుడు కూడా మిమ్మల్ని క్షమించడు. ఆలోచించుకోండి' అని జవాబు రాసి ఉత్తరం ముగించాను.

మనసంతా అదోలా అయిపోయింది.

ఎక్కడికెళ్తున్నాం మనం? ఎందుకిలా జరుగుతోంది?

మన కుటుంబవ్యవస్థ, మన సంస్కృతికి అద్దం పట్టే ఆ వైవాహిక జీవితాలు ఇప్పుడు ఎందుకు కనుమరు గవుతున్నాయి?

'ప్రేమ' ఈరోజుల్లో ఒక ఊతపదం అయింది.

పెళ్లి ఒక ఆషామాషీ వ్యవహారంలా మారిపోయింది.

ఎందుకిలా జరుగుతోంది? ఎక్కడుంది లోపం?

వ్యక్తిలోనా? వ్యవస్థలోనా? నా మనసు సమస్యల సాలెగూడులా ఉంది. అంత వెలుతురులోనూ చుట్టూ చీకట్లు అలుముకుంటున్న భావం కలుగుతోంది. నిర్లిప్తంగానే ముచ్చటైన దస్తూరీతోవున్న మూడో ఉత్తరాన్ని పైకి తీశాను.

'అక్కయ్యగారూ! మీ కథలు, నవలలు నేను రెగ్యులర్‌గా చదువుతుంటాను. మీ రచనల్లో ఎన్నో సమస్యలకు చక్కటి పరిష్కారాలు చూపించటం నాకు నచ్చి ఈ ఉత్తరం రాస్తున్నాను. నేను నా వైవాహిక జీవితం గురించి ఎన్నో కలలు కన్నాను. 'భర్త, పిల్లలు, ఇల్లూ, వాకిలీ...' అంటూ సంసారాన్ని స్వర్గంగా ఊహించుకున్నాను. కానీ... ఇప్పుడు నా కలలు కల్లలై సంసారం అనే నరకంలో చావలేక బతుకుతున్నాను. నా భర్తకు నేనంటే ప్రేమలేదు... గౌరవం లేదు. అసలు నే నొక దాన్ని ఉన్నానన్న ధ్యాసే ఆయనకు లేదు. పరస్త్రీ వ్యామోహం ఎక్కువ. ఆఖరికి...నా పురిటికి...సాయం చేయటానికి వచ్చిన నా చెల్లెల్ని కూడా వదిలిపెట్టలేదు ఆయన. అది ఏడ్చుకుంటూ ఇంటికి తిరిగి వెళ్లింది. ఎలాగోలా సర్దుకుపోదామని సంసారం గుట్టురట్టు చేసుకోకూడదని...అనుకుంటూ ఇన్నాళ్లూ సహనంతో బతికాను. కానీ ఈ మధ్య ఆయన తాగుడుకి పూర్తిగా బానిసై నన్ను చిత్రహింసలు పెడుతున్నారు. పిల్లల ముందే నన్ను కొట్టటం, బూతులు తిట్టడం చేస్తున్నారు. ఇంటి వాతావరణం పిల్లలమీద ఎలాంటి ప్రభావం చూపిస్తుందోనని భయంగా ఉంది. ఈ పరిస్థితులలో ఏమి చేయాలో తోచటం లేదు. తాళి కట్టిన భర్తను వదులుకోలేను' ఆ తరువాత ఇంక చదవటం అనవసరం అనపించింది. పైగా ఆ ఆఖరి మాటలు నాకు కోపాన్ని కూడా తెప్పించాయి.

ఆవేశంలో, కోపంతోనే జవాబివ్వబోవడం వల్ల కాబోలు నాచేతిలో పెన్ను వేగంగా పరుగులెత్తింది.

'భర్తను ఎందుకు వదులుకోలేరు? సంప్రదాయపు సంకెళ్లు, సెంటిమెంట్లు మిమ్మల్ని కట్టివేస్తున్నాయి కదూ. పరస్పర అవగాహన, ప్రేమ, భార్యాభర్త లిద్దరిలో ఉన్నప్పుడే సంసారాలు స్వర్గతుల్యాలు అవుతాయి. అవి లేనప్పుడు... బలవంతపు గృహస్థజీవితంలో రోజూ చస్తూ బతక నవసరంలేదు. మీ కంటూ ఒక జీవితం ఉంది. ఒక భవిష్యత్తు ఉంది. సంసారం నరకంలా...అందులో భర్త సాక్షాత్తు యముడిలా తయారైనప్పుడు విడిపోవటం తప్ప ఈ సమస్యకు మరో పరిష్కారం లేదని నా ఉద్దేశం. మీరూ ఆలోచించండి. నిర్ణయం మీది' అని రాసిన తర్వాత నా మనసు కాస్త కుదుటపడింది.

ఇంతకుముందే రాసిన ఒక సమాధానంలో 'పెళ్లంటే బొమ్మలాట కాదని, వివాహబంధం పవిత్రమైంది అనీ' సలహా ఇచ్చాను. ఈ ఉత్తరంలో ఇలా సమాధానం ఇచ్చాను.

అక్కడ అది సరి అయినదైతే, ఇక్కడ ఇది సరిఅయినది. అది చెయ్యిజారిపోయిన పాయస మైతే, ఇది విషం కలిసిన పాయసం. పొర బాటున చెయ్యి జారిపోయినదాన్ని తిరిగి పట్టు కుని...దక్కించుకోవచ్చు. కానీ విషం కలిసిన దాన్ని పారబోయటంతప్ప మరో దారిలేదు.

నేను సమాధానం ఇస్తోంది పర్సనల్ కాలమ్‌లోని ప్రశ్నలకు. కానీ నాకు అవి వ్యక్తిగత సమస్యలుగా కనిపించలేదు. సామాజిక సమస్యలుగా అనిపించాయి.

ఎదిగీఎదగని వయసులో తప్పుదారి తొక్కుతున్నవాళ్లూ, మానవసంబంధాలను, జీవితవిలువలను మర్చిపోయి తాత్కాలిక సుఖాలకోసం నీతినియమాలు విస్మరిస్తున్నవాళ్లూ...

దురలవాట్లతోనో, పురుషాహంకార మదంతోనో కట్టుకున్నదాన్ని కష్టాల పాలుచేసే భర్తలూ....

ప్రస్తుతం మన సమాజంలో... ఊరుఊరుకీ, వీధి వీధికీ ఎంతో మంది కనిపిస్తారు.

అందుకే ఒక్కొక్క ఉత్తరంలో... ఒక్కో శిథిలసమాజ శకలం నా కళ్లకు కనిపించి... మనసులో సూటిగా గుచ్చుకుంటాయి. బాధతో విలవిలలాడిపోతాను.

000

"మమ్మీ! నీకేమీ తెలియదు. నువ్వు మాట్లాడకు." నూనూగు మీసాల యవ్వనంలో అడుగుపెట్టిన నాకొడుకు నోటి నుండి వచ్చిన



## కమల్ సినిమాలో బిగ్ బి

తన స్వంత చిత్రం 'అభయ్' ఫ్లాప్ అయ్యాక కమల్ నిరుత్సాహానికి గురైనా, మళ్లీ నూతనోత్సాహంతో మరో చిత్రాన్ని తీయడానికి సన్నాహాలు చేస్తున్నాడు. వెరైటీగా కొత్తదనంతో సినిమాలు తీయడంలో కమల్‌ది అందె వేసిన చేయి. ఇపుడు తను తీయబోయే సినిమా కోసం బిగ్ బి అమితాబ్‌బచ్చన్ సంతకం చేశాడట. ఇరువురు దిగ్గజాలు కలిస్తే ఇక సంచలనమే.

జె.

ఆ మాటలతో అకస్మాత్తుగా నానెత్తిన పిడుగు పడ్డట్టయింది.

నా కొడుకులో నేనూహించని ఆ హఠాత్ పరిణామం నాకు గర్వభంగం కలిగించినట్లనిపించింది. కొడుకుని చూసి గర్వించాలనుకున్న నా ఆశలమీద, ఆశయాలమీద చావుదెబ్బ పడినట్లయింది. కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి.

"నువ్వు మాట్లాడకు" అని మాత్రమే అన్నందుకు 'నోర్మూసుకో'మని అననందుకు నీకు థ్యాంక్స్‌రా కిరణ్" అన్నాను. నా కంఠంలో ఎంత వద్దనుకున్నా నిష్ఠూరం ధ్వనించి ఉంటుంది.

"మీ పెద్దవాళ్లతో వచ్చిన చిక్కే ఇది మమ్మీ. ఈ కాలం కుర్రవాళ్ల సరదాలు, మారుతున్న కాలంలోని స్పీడ్ మీకు అర్థం కావు. ఏమన్నా అంటే పిల్లలు ఎదురుతిరిగారని... పెద్ద, చిన్న తారతమ్యాలు లేవని సాధిస్తారు. జనరేషన్ గేప్. పైగా నువ్వు రైటర్‌వి కూడాను" అంటూ హీరో హోండా 'కీ'ని విలాసంగా వూపుతూ... టి.వి. ఆన్ చేశాడు నిర్లక్ష్యంగా.

నాకు ఒళ్లు మండిపోయింది.

నా భుజాలు దాటి ఎదిగిపోబట్టి గానీ లేకుంటే చాచి ఒక్క లెంపకాయ ఇచ్చేదాన్ని వాడన్న ఆ ఆఖరు మాటకు.

వాడింతవరకు... నారచనలలోని... ఒక్కపేజీ... కాదు ఒక్క వాక్యం కూడా చదివి ఉండలేదు. నేనేం రాస్తానో తెలియని వాడు. 'నువ్వు రైటర్‌వి కూడానూ' అంటూ ఎగతాళి చేస్తాడా?' అనుకున్నాను ఉక్రోషంగా... కోపంగా. అంతవరకూ నాకూ, నా కొడుక్కి మధ్య జరిగిన సంభాషణ మళ్లీ నా చెవుల్లో ప్రతిధ్వనించింది.

"అర్థరాత్రి పదిపదకొండు అయితేగానీ ఇంటికి రావు. చదువుకునే పిల్లాడివి.... నీకు అంతసేపు బయట ఏం వ్యవహారాలు ఉంటాయిరా?"

"అస్తమానం కాలేజీ.. చదువు తప్ప స్నేహితులు, సరదాలు ఉండకూడదా మమ్మీ. లైఫ్‌ని ఎంజాయ్ చేయాల్సింది... ఇప్పుడు స్టూడెంట్‌గా ఉన్నప్పుడు కాకపోతే ముసలాళ్లు అయ్యాక చేస్తారా ఎవరైనా? అయినా నాకు ఈ రిస్ట్రిక్షన్స్ నచ్చవు. ఐ వాంట్ ఫ్రీడమ్"

"ఫ్రీడమ్ అంటే అర్థం తెలుసా నీకు. వయసులో ఉన్న కొడుకు... ఏదారిలో నడుస్తున్నాడో... అతని మంచి చెడ్డలేమిటో... తెలుసుకోవాల్సిన బాధ్యత తల్లిగా నాకు లేదా..."

"మమ్మీ నేను ఇంకా పాలు తాగే పసివాడ్ని కాదు. నా మంచిచెడ్డలు నేను చూసుకోగలను. కాలం మారుతోంది మమ్మీ. ఒకప్పుడు మీకు తప్పు అనిపించిన విషయాలు ఇప్పుడు కామన్ థింగ్స్‌గా మారిపోయాయి. లైఫ్ ఎంజాయ్ చేయడం చేతగానివాడ్ని... అనాగరికుడిగా చూస్తున్నారు ఈ రోజుల్లో. ఇంకా నేను నయం. మా ఫ్రెండ్స్ అయితే మరీ ఫాస్ట్."

"ఫాస్ట్ అంటే... సిగరెట్లు, డ్రింకులు, క్లబ్బుల్లో డ్యాన్సులనా నీ ఉద్దేశం..."

"అవును అదే... అయితే ఏంటి? తప్పా? అవన్నీ కామన్ విషయాలు ఈ రోజుల్లో. నాలుగుగోడల మధ్య ఇంట్లో కూర్చునేదానివి. అలాంటి విషయాల గురించి నీకేం తెలియదు గానీ... నువ్వు మాట్లాడకు మమ్మీ..." అన్నాడు. ఆ తరువాత నిజంగానే నేను మాట్లాడలేదు. ఎందుకంటే అప్పటికే నామెదడు స్తంభించిపోయింది.

000

కొత్తకథ రాద్దామని పేపరు, పెన్ను చేతిలోకి తీసుకున్నాను.

'పైగా నువ్వు రచయిత్రివి కూడాను' అన్న కిరణ్ మాటలు గుర్తొచ్చాయి. ఏమీ రాయబుద్ధి కాలేదు. రీడర్స్ మెయిల్ అయినా చూద్దామని టేబుల్ సొరుగులో ఉన్న ఉత్తరాల కట్ట తీసి విప్పాను. ఏ లెటర్ ముందు తీద్దామా అని ఆలోచిస్తుండగా ఎయిర్‌మెయిల్ ఒకటి అందులో ప్రత్యేకమైన ఆకర్షణతో కనిపించింది. ఆశ్చర్యపోయాను. నన్ను ప్రశ్నలడిగే వారంతా... ఎక్కువగా మనరాష్ట్రంలోని వాళ్లే ఉంటారు. అడపాదడపా పొరుగు రాష్ట్రాలలో ఉద్యోగరీత్యా నివసించే వాళ్లవి కూడా ఉండేవి. ఎయిర్‌మెయిల్ మాత్రం ఇదే మొదలు. ఆసక్తిగా కవరు విప్పాను.

నా అభిమాన రచయిత్రి శ్రీమతి సువర్చలగార్కి,


నమస్కారములు.

నా పేరు దమయంతి. మావారి ఉద్యోగరీత్యా మేము అమెరికా వచ్చి పది సంవత్సరాలు అవుతోంది. ఇక్కడికి వచ్చే తెలుగు పత్రికలన్నీ నేను తప్పనిసరిగా చదువుతాను. మీ రచనలన్నీ నేను జాగ్రత్తగా భద్రపరుచుకున్నాను. ఎప్పుడన్నా మనసు చికాకుగా అనిపించినప్పుడు, ఏదైనా కుటుంబసమస్య తలెత్తినప్పుడు ఏదో ఒక కథను తీసి కాసేపు చదువుకుంటే నాకు ఎంతో ఊరటగా ఉంటుంది. ఆత్మీయుల కోసం ముఖం వాచినట్లుండే ఇక్కడ నాకు మీ రచనలే మంచి స్నేహితులు. అంతేకాదు గురువులు కూడా. ఒక్కొక్క రచన ఒక్కొక్క జీవితపాఠంలా తెలియని విషయాలనెన్నింటినో నేర్పిస్తుంటుంది. భిన్నజీవితాలను, విభిన్న జీవిత సమస్యలను కళ్ల ముందుంచి చక్కటి పరిష్కారాలను సూచిస్తూ ఉంటుంది. మనిషికీ మనిషికీ మధ్యవుండే మమతానురాగాలని, మానవతా ధర్మాలని మరచి... నాగరికత మోజులో పెడదారిన పడుతున్న ఈనాటి యువతరానికి ముఖ్యంగా మీ రచనలు చాలా అవసరం...'

ఆ వాక్యం నాకు నవ్వు తెప్పించింది.

'అయ్యో... పిచ్చితల్లీ... ఏకాలంలో ఉన్నావమ్మా నువ్వు. అమెరికాలో ఉంటూ కూడా ఈ జనరేషన్ స్పీడ్‌ను, తీరికలేనితనాన్ని గమనించటం లేదా. నేటి హైటెక్‌యుగం, కంప్యూటర్ ప్రపంచంలో రచనలు చేయడాలు, చదవడాలు ఇవన్నీ హాస్యాస్పదమైన విషయాలు. అందుకే ఇప్పుడు ఎవ్వరూ పుస్తకాలు అచ్చువేయటం లేదు. తమంతట తాము వేసుకున్నా చదివే నాథుడు లేడు. ముందు ముందు అసలు ఈ కాగితాలు, కలాలు అనేవే ఉండవట. ఇప్పుడు తాళపత్రాలు గ్రంథాలుగా... కొద్దిరోజులకు అవీ మ్యూజియంలకు చేరుకుంటాయట. నీలాంటి వాళ్లను, నాలాంటి వాళ్లను పిచ్చివాళ్లుగా చూస్తారు ఇకమీద' అనుకున్నాను నిర్లిప్తంగా. తిరిగి నాకళ్లు ఉత్తరంలోని అక్షరాల వెంట పరుగులు తీసాయి.

"డబ్బు వెంట పరుగులు తీస్తూ మావారు నన్ను, పిల్లల్నీ ఇక్కడికి తీసుకొచ్చారు. డబ్బు చాలా సంపాదించాం. కానీ ఎన్నో పోగొట్టుకున్నాం. ప్రేమ, ఆప్యాయతా, అనురాగం, మనశ్శాంతీ, సాంఘిక జీవితం ఇలాంటివెన్నో కోల్పోయాం. ఇక్కడ క్షణక్షణానికి వెర్రితలలు వేస్తున్న నాగరికత, హింసాప్రవృత్తి,



విచ్చలవిడి సెక్స్... వీటన్నిటి నుంచి నా ఇద్దరు టీనేజ్ పిల్లల్ని ఎలా రక్షించుకోవాలో అర్థం కావటంలేదు. ఇక్కడి యువతరాన్ని డ్రగ్స్, డేటింగ్ వంటి ఎన్నో సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. వీటన్నిటికి దూరంగా నాకు స్వదేశానికి వచ్చేయాలనివుంది. కానీ ఇక్కడి సుఖాలకు, సరదాలకు అలవాటు పడిన మావారు, పిల్లలు ససేమిరా అంటున్నారు. 'ఇండియాలో ఏముంది?' అని ప్రశ్నిస్తున్నారు. ఈ పరిస్థితిలో ఎంతో మనోవ్యథ అనుభవిస్తున్న నాకు మీ అమూల్యమైన సలహా నివ్వండి. భరించలేని ఒంటరితనంతో బాధపడుతున్న నాకు... 'తోడు' మీ రచనలు అయితే మీరు రాయబోయే ఉత్తరం పెద్ద ఓదార్పు అవుతుంది." ఉత్తరం ముగించి పక్కన పెడుతూ అనుకున్నాను 'ఏమి సమాధాన మియ్యమంటావమ్మా? అక్కడి వెర్రినాగరికత ఇక్కడకీ వ్యాపించిందని. ప్రస్తుతం ఇక్కడ మేమూ అవే సమస్యలను ఎదుర్కొంటున్నామని చెప్పి ఊరడించనా? కాల మహిమ. మనమేం చేయలేమని 'నిరాశ పుచ్చనా?' అనుకున్నాను. ప్రతి ఉత్తరానికి చకచకా జవాబు రాసే నేను... ఇక్కడ మాత్రం కాసేపు ఆగి ఆలోచించవలసి వచ్చింది. చేతులో పెన్నుతో ఆలోచిస్తూ ఉండగా తలుపు తోసుకొని ఎవర్లో లోపలికి రావటం కనిపించింది. కిరణ్ అనుకున్నాను ప్యాంటు, షర్టు చూసి... కానీ కాదు నా కూతురు శ్రావణి. పేరు మోటుగా ఉందని ఈ మధ్యనే శ్రావ్యగా మారిన శ్రావణి. పాయింటెడ్ షూస్ టకటక లాడించుకుంటూ వచ్చి, వస్తూనే హ్యాండ్ బ్యాగ్ విసురుగా సోఫాలో పడేసి. నావంక రుసరుసలాడుతూ చూసింది.

"అస్తమానం... పేపర్లు ముందేసుకుని ఏదో రాస్తూ ఉంటావు. నీ రచనలకు ఒకటైం అంటూ ఉండదా మమ్మీ. అయినా నువ్వు అంత కష్టపడి రాయడమే గానీ నీ రచనలు ఎవరు చదువుతున్నట్టు. అంత తీరిక, ఓపికా ఎవరికుంటాయి బాబూ ఆ బోర్ చదవడానికి"

షాక్ మీద షాక్ తగలటంతో నోటమాట రాలేదు నాకు.

చేతిలో పెన్ను ఎప్పుడో జారిపోయి పాడ్‌మీద పడిపోయింది. 'నా శ్రావణేనా ఇలా మాట్లాడుతోంది? ఇది నా పెంపకంలోని లోపమా? లేక సహవాసదోషమా? లేక కాలవిచిత్రమా?' అనిపించింది.

ఉద్యోగరీత్యా ఊరూరా తిరిగే మావారు... పిల్లల చదువుల కోసమని... నన్ను... సిటీలోనే వదిలేస్తే మొదటినుంచీ తల్లినీ... తండ్రినీ నేను అయి వాళ్ల మంచిచెడ్డలు చూశాను. నా రచనలు నా పిల్లల పెంపకానికి ఆటంకం కలగకుండానే జాగ్రత్తపడ్డాను. గోరుముద్దలు తినిపించిన వయసు నుండే మంచి చెడు, నీతి న్యాయం నేర్పించాను. లోకం పోకడ అర్థమయ్యేలా చెప్పాను. రోజూ ఉదయం, సాయంత్రం చాపమీద నా పక్కన కూర్చోపెట్టుకుని పాఠాలు చదివించాను. హోంవర్క్‌లు చేయించాను. నా పిల్లల్ని నేను చాలా పద్ధతిగా, క్రమశిక్షణలో పెంచానని అనుకున్నాను. గర్వపడ్డాను. మొన్న కిరణ్, ఈ రోజు శ్రావణిల మాటతీరు... ఆ దుడుకుతనం, ఆ దురుసుతనం. ఇవన్నీ నాకు ఆశాభంగాన్ని కలిగించాయి. నా పిల్లల్ని చూసి నేను గర్వపడాలనుకుంటున్న సమయంలో నా మనసుమీద ఆశనిపాతంలా వచ్చిపడ్డాయి వాళ్ల మాటలు.

చిన్నతనం... వదిలి... పిల్లలు వయసులోకి అడుగుపెడుతున్న సమయంలో... నాకు కొంత దూరమవుతున్నట్లు...ఇంట్లోకన్నా బయట ఎక్కువకాలం గడుపుతున్నట్లు నా కనిపించినా 'అది సహజమని' సరిపెట్టుకుంటూ వచ్చాను.

ఫ్యాషన్ల ప్రభావానికి, ఫ్రెండ్స్‌తో సరదాలకి చేరువై చెయ్యిజారిపోతున్నట్లు అనిపించినా మరీ స్ట్రిక్ట్‌గా వాళ్లని బంధించినట్లు చేస్తే మొండికేస్తా రేమోనని, వాళ్ల ఇష్టానికి వాళ్లని వదిలేసి దూరం నుండి గమనిస్తూ వచ్చాను. దాని ఫలితం ఇది? అందుకే ఇక సహనం చచ్చిపోయి శ్రావణివంక కోపంగా చూస్తూ అన్నాను.

"శ్రావణీ... నీకు ఎన్నోసార్లు చెప్పాను. ఎవరితోనైనా మాట్లాడుతున్నప్పుడు సౌమ్యంగా, వినయంగా మాట్లాడాలని. నీకు ఈ దురుసు తనం ఎప్పటినుంచి వచ్చింది?" అని. దానికి తారాజువ్వలా నామీద ఎగిరిపడింది శ్రావణి.

"ఏం ఆడపిల్లనైనంత మాత్రాన నేను గట్టిగా మాట్లాడకూడదా? అన్నయ్య మాట్లాడితే తప్పులేదు. ఎందుకంటే వాడు మగపిల్లవాడు కదా. వినయంగా ఒదిగి ఒదిగి ఉండటం ఎవరేమన్నా పడివుండటం ఆడపిల్లలకు తల్లి ఉగ్గుపాలతో నేర్పిస్తుండబట్టే మనదేశంలో ఆడవాళ్ల బతుకులు ఇలా తగలడ్డాయి" అంటూ అసందర్భంగా, అప్రస్తుతంగా ఆగ్రహం ప్రకటించింది నామీద. నామీదే కాదు ఈ సమాజం మీద కూడా.


'ఇదెందుకిలా తయారవుతోంది? స్త్రీ పురుష సమానత్వం మీద నేనెప్పుడూ దీనికి ఏ పాఠాలూ నేర్పించలేదే?' అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను.

వాడికి 'ఫ్రీడమ్' అంటే అర్థం తెలియదు.

దీనికి 'ఫెమినిజమ్' అంటే అర్థం తెలియదు.

వాటి ఉద్దేశాలూ, ప్రయోజనాలూ ఇద్దరికీ ఏమాత్రం తెలియవు. అయినా వాటిని ఉపయోగించటం ఒక ఫ్యాషన్‌గా, నాగరికత చిహ్నంగా, అలవాటుగా మారిపోయింది వీళ్లకు.

నిరాశతో, నిస్పృహతో, 'ఇది' ఇది అని పైకి చెప్పుకోలేని బాధతో ఆ రోజంతా నా మనసు అదోలా అయిపోయింది.




'పర్సనల్ కాలమ్'లో రోజూ సమస్యలకు సమాధానాలు ఇచ్చే నాకు నా పర్సనల్ ప్రోబ్లమ్ ఎవరితో చెప్పుకోవాలో అర్థం కాలేదు. నిజానికి ఇది పర్సనల్ ప్రోబ్లమ్ కాదు. ఇది ఒక సామాజిక సమస్య. ఇది ఒక దేశ సమస్య. ఇది ప్రపంచ సమస్య. సమాధానం ఈ వ్యవస్థే చెప్పాలి. ■